


# ఈకాలం
THE HONEST TELUGU DAILY




శనివారం 07-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :127 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

## బడుగులకే బీహార్ పీఠం

- బీహార్ లో తొలి బీజేపీ సర్కార్
- సీఎం, డిప్యూటీ సీఎం పదవులు ఎవరిని వరించొచ్చని ఊహాగానాలు ?
- బీహార్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా నీతీశ్ రాజీనామా



బిహార్లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలం సీఎంగా కొనసాగిన నీతీశు క్మార్ రాజ్యసభకు వెళ్లనుండటంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది.

## భారత వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీ పడాలి


- మనఉత్పత్తుల ప్రమాణాలను, నాణ్యతను, బ్రాండింగ్ను ప్రోత్సహించాలి
- భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ గుర్తింపు రావాలి
- ఎగుమతులే లక్ష్యంగా సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని బలోపేతం కావాలి
- వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలి
- వ్యవసాయ రంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు కలిపి పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు

వ్యవసాయ రంగాన్ని ఎగుమతుల ఆధారితంగా, ప్రపంచదేశాలతో పోటీపడే విధంగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యవసాయ రంగం నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతులు కలిపి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్లో 'వ్యవహాయం, గ్రామీణ పరివర్తన' అనే అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.



## దేశానికి నక్సలిజం నుంచి విముక్తి

- ఈ నెలాఖరుకు అనుకున్న లక్ష్యం చేరుతున్నాం - నక్సలిజం నిర్మూలనలో సీఐఎస్ఎఫ్ కీలకపాత్ర - రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలనుకున్న వారిని తుదముట్టించాం



దేశంలో నక్సలిజాన్ని తుదముట్టించాలని మోడీ సర్కార్ తీసుకున్న సంకల్పాన్ని పూర్తిచేయటంలో సీఐఎస్ఎఫ్ కీలకభూమిక పోషించినట్లు కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

## మాదిగల అభివృద్ధి నా బాధ్యత

- వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉంది
- ఇందులో నాకు ఎటువంటి అనుమానం లేదు
- గత ఎన్నికల్లో మాటలు, మూటలతో గెలవలేదు
- అందుకే విద్యాశాఖ తీసుకున్నాను
- శిల్పకళా వేదికగా మాదిగ ఉద్యోగుల ధన్యవాద సభలో సీఎం రేవంత్ రెడ్డి



చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ నిర్వహించిన ధన్యవాద సభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగజాతి ఎంతో పోరాటం చేసిందని కొనియాడారు. ఈ పోరాటంలో అనేకమంది ప్రాణాలు కూడా కోల్పోయారని గుర్తుచేశారు. స్వయంగా తాను ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ సమస్యను ప్రత్యక్షంగా చూస్తూ వచ్చానని తెలిపారు. ఈ న్యాయమైన హక్కుపై మొదటినుంచి కూడా అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు.

## నగరాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తాం



- 99 రోజుల కార్యాచరణతో ముందుకెళ్తాం
- 10 అంశాలపై స్థానిక సమస్యల పరిష్కారంపై కార్యాచరణ
- జూన్ 12 వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




- అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధ ప్రభావంతో స్టాక్ మార్కెట్ల భారీ పతనం
- ఒక్కరోజే *1097* పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- బ్రహియిన్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడితో పెరిగిన చమురు ధరలు
- భారీగా పడిపోయిన బ్యాంకింగ్, రియల్టీ రంగ షేర్లు

## గళం ఎత్తిన గీతం

- బీసీ హక్కుల కోసం సాంస్కృతిక గర్జన పాటలతో బీసీ ఉద్యమానికి కొత్త ఊపు
- సంస్కృతిక శక్తితో చైతన్యం పెంపు అవసరం : ఎంపీ ఆర్. కృష్ణయ్య



బీసీ వర్గాల హక్కుల సాధనలో సంస్కృతిక శక్తి కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖులు పేర్కొన్నారు. బీసీ కళామండలి జాతీయ అధ్యక్షుడు రామలింగం అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన "ధూమ్ ధామ్" సంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

## ప్రజాపాలన - ప్రగతికి సరికొత్త బాట




- 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి
- రెవెన్యూ - అటవీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం - ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## వంట గ్యాస్ సరఫరాపై ఆంక్షలు



- మిడిల్ ఈస్ట్లో యుద్ధ కారణంగా కేంద్రం కీలక నిర్ణయం
- గృహ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత
- వాణిజ్య రంగ సిలెండర్లపై తాత్కాలిక పరిమితులు

## తెలంగాణలో ఉద్యమ కార్యాచరణ చేపడతాం

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్న శివసేన పార్టీ ముంబై నందవనన్ బంగ్లాలో ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేతో రాష్ట్ర అధ్యక్షులు సింగారు శివాజీ భేటీ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన పార్టీ అధినేత ఏక్ నాథ్ షిండేతో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ భేటీ అయ్యారు.



# సంపాదకీయం

## భారత్ నైతిక ఔన్నత్యం ఏమైనట్టు?

మరో యుద్ధం ప్రారంభమయింది. ప్రచండంగా ఉధృతమవుతోంది. ఈ సమర సంక్షోభ సూత్రకర్త ఇజ్రాయెల్ కాగా యుద్ధ ప్రణాళికను అమలుపరుస్తోన్న దేశం అమెరికా. ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలను అభివృద్ధిపరచుకున్నదని, అమెరికాపై దాడులకు సైతం సంసిద్ధమవుతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ నూరిపోసింది. తక్షణమే యుద్ధ చర్య చేపట్టకపోతే ఇరాన్ నుంచి అణ్వాయుధ దాడికి గురికావలసి ఉంటుందని ఇజ్రాయెల్ హెచ్చరించింది. నిజమేమిటి? వర్గీకృత సమాచారం (జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత రహస్య విషయాలు) అందుబాటులో ఉన్న ఉన్నతస్థాయి అధికారులు అమెరికాకు ఇరాన్ నుంచి అణ్వాయుధ దాడుల సంభావ్యతను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారని 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ తోడ్పాటుతో ఇరాన్‌కు వ్యతిరేకంగా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించారు. ఇరాన్ నుంచి అమెరికాకు అణ్వాయుధ దాడి ముప్పు అనేది ఒక పచ్చి అబద్ధం. గతంలో ఇరాక్‌కు వ్యతిరేకంగా ఇటువంటి నిరాధార వదంతుల ప్రచారం జరిగింది. నాటి ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్ సామూహిక జనహనన మారణాయుధాలను సమకూర్చుకున్నాడన్న ఆరోపణతో 2003లో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఆ దేశాన్ని ఆక్రమించుకున్నాడు. లిబియా నియంత గడాఫీ పెద్ద ఎత్తున పౌరులను హతమార్చేందుకు పథకాలు సిద్ధం చేసుకున్నాడనే ప్రచారం అమెరికన్ మీడియాలో జరిగింది. లిబియాలో సంక్షోభాన్ని నివారించేందుకు ఆ దేశంలో సైనిక జోక్యానికి 2011లో అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆదేశించారు. వెనెజువెలాలో 'పాలన మార్పు'కై మన్రో సిద్ధాంతాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ తలకెత్తుకున్నాడు. ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రారంభించేందుకు ఆ సిద్ధాంతాన్ని పశ్చిమాసియాకు కూడా వర్తింపజేశాడు. గతంలో ఇరాక్, లిబియాలో, ఇప్పుడు ఇరాన్‌లో అమెరికా సైనిక జోక్యాలు ఎంతమాత్రం చట్టబద్ధమైనవి కావు. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా మరో దేశంపై యుద్ధాన్ని ప్రకటించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లేదు. ఈ నిబంధన ప్రకారం ఇరాక్, లిబియా, ఇరాన్‌లో సైనిక జోక్యాలు పూర్తిగా అక్రమమైనవి. ఇటువంటి సైనిక జోక్యాలు ఐక్యరాజ్యసమితి అధికార పత్రం (చార్టర్)కు కూడా వ్యతిరేకమైనవి. ఈ సైనిక జోక్యాలు పూర్తిగా న్యాయవిరుద్ధమైనవి. ఒక సార్వభౌమిక దేశంలో పాలన మార్పునకు పూనుకునేందుకు మరే దేశానికీ అధికారం లేదు. మరో దేశంలో పాలన మార్పునకు పూనుకోవడం అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమైనది. ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా చేస్తున్న యుద్ధం ఎంతగా న్యాయవిరుద్ధమైనదో, వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అమెరికా కిడ్నాప్ చేయడం కూడా అంతే న్యాయ విరుద్ధమైనది. ఇరాన్ అధినేత అయతొల్లా ఖమేనీని, ఆయన సహచర నాయకులను ఇజ్రాయెల్ హతమార్చడం కూడా అంతే న్యాయ విరుద్ధమైనదని మరి చెప్పనవసరం లేదు. ఖమేనీ మరణం పట్ల భారత్ ఆరు రోజుల తరువాత మాత్రమే సంతాపం వ్యక్తం చేసింది! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగిస్తూ 'హమాస్ అనాగరిక దాడిలో ఆప్తులను కోల్పోయిన' ఇజ్రాయెలీ కుటుంబాలకు భారతదేశం తరఫున సానుభూతి తెలిపారు. ఈ సంక్షోభ సమయంలోను, ఆ తరువాత కూడా ఇజ్రాయెల్‌కు భారత్ బాసటగా ఉంటుందని' ఆయన ప్రకటించారు. అయితే గాజాలోని పాలస్తీనియన్ల ఆవాసాలను ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా మట్టుబెట్టి వేలాది కుటుంబాలను పూర్తిగా నిరాశ్రయులను చేసిన ఘోర చర్యలను ఆయన మాటమాత్రంగానైనా ఖండించలేదు. ఎటువంటి కవ్వింపు లేకుండానే హమాస్ పాల్పడిన దాడిలో 1219 మంది ఇజ్రాయెలీలు చనిపోయిన మాట వాస్తవమే. అయితే గాజాలో ఇజ్రాయెల్ సైనిక దాడుల్లో 70 వేల మంది పాలస్తీనియన్లు హతమారిపోయిన విషయాన్ని మోదీ ఎలా విస్మరించారు? ప్రధాని మోదీ ఫిబ్రవరి 25న ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించారు. ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమయింది. పలు అరబ్ దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతి దాడులు చేసింది. ఇరాన్‌పై తమ సైనిక దాడులు మూడు లేదా నాలుగు వారాలు, ఇంకా అంతకంటే ఎక్కువ కాలం కొనసాగవచ్చని ట్రంప్ ప్రకటించాడు. ఇజ్రాయెల్‌కు ఆయన పూర్తి మద్దతు నిస్తున్నారు. దీంతో ఆ యుద్ధం అరబ్ దేశాలకు వ్యాపించకుండా నిరోధించేందుకు పూనుకునే అవకాశం భారత్‌కు లేకుండా పోయింది. శాంతిసాధనకు అవసరమైన నైతిక అధికారాన్ని భారత్ కోల్పోయింది. ఇరాన్‌లో పాలన మార్పును సాధించడమే అమెరికా, ఇజ్రాయెల్‌ల ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే ఆ ఉభయ దేశాలు ఇరాన్‌పై యుద్ధానికి ఉపక్రమించాయి. అయితే ఒక దేశంలో పాలన ఎంత ఘోరంగా ఉన్నప్పటికీ బల ప్రయోగంతో ఆ పాలనను మార్పు చేసేందుకు మరో దేశానికి ఎటువంటి హక్కూ ఉండదు. ఒక దేశంలో పాలన మార్పునకు మరో దేశం పూనుకోవడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధం. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా--ఇజ్రాయెల్‌లు చేస్తున్న వాదనల ప్రకారం చూస్తే, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 50కు పైగా దేశాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను మార్చవలసి ఉంది. ఇదెలా సాధ్యం? అసలు ఆ దేశాలలో అధికారంలో ఉన్న నియంతలు అమెరికాకు విశ్వసనీయ స్నేహితులే. వారిలో ఒక్కరూ అమెరికా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించేవారు కానేకాదు.

జూన్ 2025లో ఇజ్రాయెల్ ప్రోద్బలంతో అమెరికా ఇరాన్‌కు వ్యతిరేకంగా 'మిడ్ నైట్ హ్యామర్' పేరిట సైనిక దాడులకు పూనుకున్నది. పన్నెండు రోజుల పాటు ఆ దాడులను కొనసాగించి, విరమించిన అనంతరం 'ఇరాన్‌లో అణ్వాయుధాల అభివృద్ధి సదుపాయాలను పూర్తిగా నిర్మూలించినట్టు' అమెరికా ప్రకటించింది. అది నిజమైతే ఇరాన్ అణ్వాయుధాలను ఎలా సమకూర్చుకున్నది? శుద్ధి చేసిన యురేనియం నిల్వలను ఎలా పెంపొందించుకున్నది? అమెరికాకు ముప్పుగా ఎలా పరిణమించింది? అంతేకాదు, శుద్ధి చేసిన యురేనియం నిల్వ చేసుకోబోమని, ఎట్టి పరిస్థితులలోను అణ్వాయుధాల అభివృద్ధికి పూనుకోబోమని ఇరాన్ విస్పష్టంగా చెప్పిందని ఇరాన్--అమెరికాల మధ్య మధ్యవర్తిత్వం నెరపుతున్న ఒమన్ ప్రకటించింది. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లవ్రోవ్ ఒక ముఖ్యమైన ప్రశ్న అడిగారు: 'ఇరాన్‌లో అణ్వాయుధాలు ఉన్నాయనేందుకు రుజువులు ఏవి, ఎక్కడ ఉన్నాయి?' అమెరికా గతంలో ప్రారంభించిన కొన్ని యుద్ధాల వలే ఇప్పుడు ఇరాన్‌పై యుద్ధం కూడా అబద్ధాల ఆధారంగానే ప్రారంభమయింది, సందేహం లేదు. ఇరాన్, ఇజ్రాయెల్‌లు పరస్పరం బద్ధ శత్రువులు. ఇజ్రాయెల్‌కు ఇరాక్, లిబియాల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లని భద్రమైన పరిస్థితులను అమెరికా కల్పించింది. సౌదీ అరేబియాతో ఇజ్రాయెల్ శాంతి ఒప్పందం కుదుర్చుకున్నది. కనీసం కొంత కాలమైనా సౌదీతో శాంతి సుస్థిరంగా ఉండవచ్చు. ఇప్పుడు ఇరాన్ నుంచి మాత్రమే ఇజ్రాయెల్‌కు ప్రమాదం ఎదురయ్యే అవకాశమున్నది. ఈ కారణంగానే ఇరాన్‌లో పాలన మార్పునకు పూనుకునేలా అమెరికాను ఇజ్రాయెల్ ప్రోత్సహించింది. అయతొల్లా ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చివేసి కొత్త పాలకులను తీసుకురావడం ద్వారా ఇరాన్‌ను పూర్తిగా దాసోహం చేసుకోవాలని అమెరికాను ఇజ్రాయెల్ ఒత్తిడి చేసింది. ఇదొక అసంగత సిద్ధాంతం, ఒక ప్రభుత్వ పాలన ఎంత నరకప్రాయంగా ఉన్నప్పటికీ, ఆ పాలనను మార్చివేసే హక్కు పూర్తిగా ఆ దేశ ప్రజలదేగానీ మరో దేశానికి ఎంత మాత్రం ఉండదు.

ఇరాన్‌పై తమ దాడులు అసాధారణంగా విజయవంతమవుతున్నాయని అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రకటిస్తున్నాయి. ప్రముఖ ఇజ్రాయెలీ పాత్రికేయుడు అలొన్ మిజ్రాహి ఆ ప్రకటనలతో విభేదించారు.

# గళం ఎత్తిన గీతం

**- బీసీ హక్కుల కోసం సాంస్కృతిక గర్జన**
**- సంస్కృతిక శక్తితో చైతన్యం పెంపు**
**-పాటలతో బీసీ ఉద్యమానికి కొత్త ఊపు అవసరం : ఎంపీ ఆర్. కృష్ణయ్య**

బీసీ వర్గాల హక్కుల సాధనలో సంస్కృతిక శక్తి కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖులు పేర్కొన్నారు. బీసీ కళామండలి జాతీయ అధ్యక్షుడు రామలింగం అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన "ధూమ్ ధామ్" సంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని ఉద్యమానికి సంస్కృతిక దిశ ఎంత అవసరమో వివరించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ వర్గాల హక్కుల సాధనలో చైతన్యోద్యమం అత్యంత కీలకమని అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే కేవలం రాజకీయ చర్చలు, తీర్మానాలు సరిపోవని, ప్రజల్లో అవగాహన పెరగాలని పేర్కొన్నారు. ఆ అవగాహనను వేగంగా వ్యాప్తి చేయగల శక్తి సంస్కృతిక రంగానికి ఉందన్నారు. గతంలో జరిగిన అనేక సామాజిక ఉద్యమాల్లో పాటలు, జానపద కళారూపాలు ప్రజలను సంఘటితం చేశాయని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా ఉద్యమ గీతాలు ప్రజల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయని అన్నారు. అదే విధంగా బీసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని ప్రజలకు చేరవేయడంలో కళాకారులు ముందుండాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాలు దేశంలో అతిపెద్ద సామాజిక వర్గం అయినప్పటికీ వారికి తగిన రాజకీయ, ఆర్థిక, విద్యా అవకాశాలు పూర్తిగా అందడం లేదని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీసీ సమాజం మరింత సంఘటితంగా ముందుకు రావాలని, యువత ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

పాటలు, నాటికలు, జానపద కళారూపాల ద్వారా బీసీ వర్గాల చరిత్రను, కష్టాలను, విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లాలో సంస్కృతిక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తే ఉద్యమం మరింత బలపడుతుందని కృష్ణయ్య అన్నారు.

గుజ్జ సత్యం ప్రసంగం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ బీసీ ఉద్యమం కేవలం రాజకీయ హక్కుల సాధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి దారి తీసే ఉద్యమమని పేర్కొన్నారు. సమాజంలో అవగాహన పెరగకుండా హక్కుల సాధన సాధ్యం కాదని, అందుకే ఉద్యమానికి సంస్కృతిక విభాగం అవసరం ఉందన్నారు. మాటలతో చెప్పే సందేశం కొందరికే చేరవచ్చు. కానీ పాటల ద్వారా చెప్పే సందేశం ప్రతి మనసులోకి చేరుతుంది" అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద గీతాలు ప్రజల జీవితాల్లో ఒక భాగమని, వాటి ద్వారా ఉద్యమ భావజాలాన్ని సులభంగా వ్యాప్తి చేయవచ్చని చెప్పారు. బీసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు తెలియజేయడంలో కళాకారులు, గాయకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ చరిత్ర, వారి పోరాట గాథలు, సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఉద్యమాన్ని ప్రతిబింబించే గీతాలను రూపొందించాలని సూచించారు. ప్రతి జిల్లాలో సంస్కృతిక బృందాలు ఏర్పడి గ్రామ గ్రామానికి వెళ్లి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తే ఉద్యమం మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని గుజ్జ సత్యం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేయడంలో సంగీతం మరియు కళారూపాలు ప్రభావవంతమైన సాధనాలుగా మారతాయని తెలిపారు. అరుణ్ కుమార్ ప్రసంగం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పెంచడంలో

కళాకారుల పాత్ర అత్యంత గొప్పదని అన్నారు. ఉద్యమాలు విజయవంతం కావాలంటే ప్రజల్లో భావోద్వేగ అనుసంధానం అవసరమని, ఆ అనుసంధానాన్ని కలిగించే శక్తి కళలకు ఉందన్నారు. సామాజిక ఉద్యమాలు ప్రజల్లోకి వెళ్లాలంటే సంస్కృతిక కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పాటలు ప్రజల హృదయాలను కదిలించే శక్తి కలిగి ఉంటాయని తెలిపారు. కళాకారులు తమ ప్రతిభను సమాజ అభ్యున్నతికి వినియోగించుకోవాలని సూచించారు. బీసీ వర్గాల సమస్యలను సమాజానికి తెలియజేయడంలో సంస్కృతిక వేదికలు ప్రభావవంతమైన సాధనాలుగా మారాలని ఆయన అభిప్రాయపడ్డారు. యువ కళాకారులను ప్రోత్సహించి ఉద్యమ గీతాలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తే ఉద్యమం మరింత బలపడుతుందని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీసీ కళామండలి జాతీయ అధ్యక్షుడు రామలింగం మాట్లాడుతూ బీసీ కళాకారులు సమాజంలో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సంస్కృతిక కార్యక్రమాలు ఉద్యమానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. బీసీ కళామండలి ద్వారా దేశవ్యాప్తంగా కళాకారులను ఒక వేదికపైకి తీసుకురావాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కళాకారులు తమ ప్రతిభను సమాజ అభ్యున్నతికి వినియోగించుకోవాలని, బీసీ సమాజంలో ఐక్యత పెంపుకు పాటలు మరియు కళారూపాలు వేదిక కావాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్నసంస్కృతిక ప్రదర్శనలు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు కలిసి నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు సభను ఆకట్టుకున్నాయి. ఉద్యమ గీతాలు, జానపద నృత్యాలు, నాటికల ద్వారా బీసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిబింబించారు. ఈ ప్రదర్శనలు సభలో పాల్గొన్నవారిలో ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. సంస్కృతిక శక్తిని ఉద్యమంతో అనుసంధానం చేస్తూ బీసీ సమాజంలో చైతన్యం పెంపు దిశగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

# గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత ప్రధాని మోడీదే

**- మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు 33% రిజర్వేషన్**
**- తెలంగాణలో మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి**
**- రాష్ట్ర ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది**
**- బీజేపీ తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు - బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు**

నారీ శక్తి అనేది కేవలం నినాదమే కాదు జాతీయ భావానికి నిదర్శనం అనే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో విశిష్ట అతిధిగా బిసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పాల్గొన్నారు. హైదరాబాద్లోని కత్రియా హోటల్ లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఢిల్లీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ గారు ముఖ్య అతిథిగా హాజరుకాగా, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని మహిళలకు అపార గౌరవం, అవకాశాలు లభిస్తున్నాయి. "నారీ శక్తి" అనే భావన కేవలం బిజెపి నినాదమే కాదు. దేశ నిర్మాణానికి సంబంధించిన ఒక జాతీయ మిషన్ అని అన్నారు. ఒకప్పుడు దేశంలో ఆడబిడ్డ పుట్టడాన్ని నిర్లక్ష్యంగా చూసే పరిస్థితులు ఉండేవి. ఆడ శిశు వులను గర్భంలోనే హతమార్చే దారుణ పరిస్థితులు కూడా చోటుచేసుకున్నాయి. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ఉద్యమరీతిలో ప్రారంభించిన బేటీ బచావో, బేటీ పఢావో పథకం సమాజంలో పెద్ద మార్పు వచ్చిందన్నారు. ప్రస్తుతం ఆడబిడ్డలను కాపాడడమే కాకుండా వారికి విద్య, సాధికారత కల్పించే దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. మోదీ ప్రభుత్వం మహిళల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చే

తొలి రక్షణ మంత్రిగా మహిళను చేసింది ఎన్డీఏనే ఎన్డీఏ హయాంలో మహిళలకు ప్రాధాన్యం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. దేశంలోని పేద మహిళల వంటగదుల్లో పొగల బదులు ఇప్పుడు వెలుగులు మెరిసిపోతున్నాయి. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో కోట్లాది కుటుంబాలు ఎల్పీజీ సౌకర్యం పొందాయి. గ్యాస్ వాడకంతో గృహ వాయు కాలుష్యం తగ్గి, మహిళల ఆరోగ్యం మెరుగుపడింది. వంటగదిలోనే కాదు, జీవనశైలిలోనూ 'ఉజ్వల' మార్పు కనిపిస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 'దే. కోట్లాది మంది పేద కుటుంబాలకు పక్కా ఇల్లు కల్పిస్తూ, మహిళల పేరుతో ఇంటి హక్కు, తక్కువ వడ్డీతో రుణాలు, అధిక సబ్సిడీ కల్పిస్తూ సొంతింట కలను సాకారం చేశారన్నారు. మోదీ ప్రభుత్వంలో మహిళలకు వివిధ రంగాల్లో అనేక అవకాశాలు లభిస్తున్నాయి. నేడు మహిళలు బస్సులు నడుపుతున్నారు, వ్యాపారాలు మహిళలు బస్సులు నడుపుతున్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రతి రంగంలో వారు ముందుండి దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ముని భారత రాష్ట్రపతిగా బీజేపీ మద్దతుతో ఎన్నుకోవడం జరిగింది. కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించినప్పటికీ, నేడు ఆమె దేశపు తొలి గిరిజన మహిళా రాష్ట్రపతిగా గౌరవంగా సేవలందిస్తున్నారు. ఇది



సమాజంలోని ప్రతి వర్గానికి చెందిన మహిళలను సాధికారత కల్పించాలనే బీజేపీ సంకల్పానికి నిదర్శనం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నిర్మలా సంకల్పానికి నిదర్శనం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నిర్మలా సీతారామన్ భారతదేశపు తొలి మహిళా రక్షణ మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మహిళా నాయకత్వానికి చారిత్రక మైలురాయి అని అన్నారు. మహిళల రాజకీయ సాధికారతకు బాటలు వేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న మరో చారిత్రక నిర్ణయం "నారీ శక్తి వందన్ అధినియమ్" (మహిళా రిజర్వేషన్ బిల్లు 2023) పార్లమెంట్ మరియు రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ చట్టం దశాబ్దాలుగా పెండింగ్లో ఉండగా, కొత్త పార్లమెంట్ భవనంలో తొలి రోజే దీనిని ఆమోదింపజేసి మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతపై తన నిబద్ధతను చాటిచెప్పిందన్నారు. జాతీయ భద్రతా రంగంలో కూడా మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ వంటి ఆపరేషన్లలో మహిళా అధికారులు బాధ్యతలు నిర్వర్తించడం ద్వారా భారతదేశ ఆడబిడ్డలు దేశ రక్షణలో కూడా ముందుంటారని స్పష్టమవుతోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లాడ్లీ లక్ష్మీ యోజన వంటి పథకాల ద్వారా ఆడబిడ్డలకు విద్యా, ఆర్థిక సహాయం అందిస్తూ వారిని సాధికారత వైపు నడిపిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై నేరాలు. పెరుగుతున్నాయి. మహిళలపై హింస, గృహ హింస, ఇతర నేరాల కేసులు నేలల్లో నమోదవుతున్నాయి. కానీ భద్రత కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను మర్చిపోయింది. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసేలేదు.. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి అసలు దాని గురించే మాట్లాడటం లేదన్నారు. మహిళలు సురక్షితంగా లేని పరిస్థితిలో.. "ప్రజాపాలన అని ఎలా పిలుస్తారు.. తెలంగాణ ప్రజలు అన్ని పరిస్థితులనూ గమనిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలయిందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాలు మహిళలను సాధికారత కల్పించే పథకాలను అమలు చేస్తూ, వారి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నందునే ప్రజలు బీజేపీ పై నమ్మకాన్ని ఉంచుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు మార్పు కోరుకుంటూ సుపరిపాలన కోసం బిజెపిలో చేరాలని విజ్ఞప్తి చేస్తున్నాను. చదువుకున్న మహిళలు, యువ మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన సమయం వచ్చిందన్నారు.

# ప్రాథమిక పాఠశాల కిష్టారెడ్డిపేట లో స్వయం పరిపాలన దినోత్సవం....



పెద్దేరు మున్సిపాలిటీలోని కిష్టారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజు విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాత్ర పోషించి పాఠాలు చక్కగా బోధించి వారు వారి వారి బాధ్యతను నిర్వర్తించారు.కలెక్టర్ గా ఆనంద్, డీఈవోగా గణేష్, ఎంఈఓ గా ఉదయ్, ప్రధానోపాధ్యాయులు గా మధులత మరియు 12మంది ఉపాధ్యాయులయ్యారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి జయరాములు హాజరయ్యి విద్యార్థులను అభినందించడం జరిగినది.ఎంపిపి చైర్ పర్సన్ శ్రీమతి బాలీశ్వరమ్మ,కౌన్సిలర్ తాటికొండ కృష్ణ,శివసాయి,గోవర్ధన్ రెడ్డి, మంద అక్కమ్మ,కంచుపాటి లక్ష్మీనారాయణ నాయుడు,గోవింద్ నాయుడు కార్యక్రమానికి హాజరయ్యారు..

# స్ఫూర్తి వెలుగు మండల సమాఖ్య మహిళా దినోత్సవం



తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ మహిళా సాధికారతలో మండల సమాఖ్యలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలో ఝురాసంగం ప్రాంతంలో నిర్వహించిన "స్ఫూర్తి వెలుగు" మండల సమాఖ్య మహిళా దినోత్సవ వేడుకలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం లేదా మండల సమాఖ్య వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల అభివృద్ధి, పొదుపు సంఘాల బలోపేతం మరియు సామాజిక చైతన్యం ఈ వేడుక ముఖ్య ఉద్దేశ్యం మండల సమాఖ్యలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు లేదా మహిళా సంక్షేమ రంగంలో విశేష కృషి చేసినందుకు గాను వారికీ సన్మానించారు.?ఈ కార్యక్రమం లో మండల సమాఖ్య ప్రతినిధులు, సంఘం నాయకురాళ్లు మరియు స్థానిక ప్రముఖులు ఉన్నారు. వీరంతా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో మరియు మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# పాత పాల్వంచ 46వ డివిజన్ లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ఆధ్వర్యంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



తెలంగాణా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుండి తలపెట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత పాల్వంచ 46వ డివిజన్ లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

- పాత పాల్వంచలోని నాలుగు మంచినీటి బావులలో బిలీచింగ్ పొడి చల్లించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయించారు.
- మైసమ్మతల్లి దేవాలయం వెనుక బజార్లో డ్రైనేజీ క్లీనింగ్, వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద చెత్తకుప్పలు తొలగించారు. డ్రైన్లకు, రోడ్డు ప్రక్కన వున్న మొక్కలను, చెట్లను కొట్టివేయించారు.

ఈ కార్యక్రమాల్లో మున్సిపాలిటీ సిబ్బంది, ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు, మహిళలు, పాత పాల్వంచ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి అభినందనలు

**- డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ మర్యాదపూర్వక భేటీ**



కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వేం నరేందర్ రెడ్డిని కరీంనగర్ డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నిక కావడం లాంఛనమేనని అన్నారు.
రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అవసరమైన నిధులను సాధించడంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ముఖ్యమైన పాత్ర పోషిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందని, అందుకు వేం నరేందర్ రెడ్డి ఎంపికే నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాన సలహాదారుగా వ్యవహరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తగిన సూచనలు అందిస్తున్నారని, భవిష్యత్తులో కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తారని సిరాజ్ హుస్సేన్ తెలిపారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమించే యత్నం

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**





**ఈకాలం, ఆదిలాబాద్**
ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొంతమంది ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ విషయంపై జిల్లా ఇంచార్జీ మంత్రి, ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఇసుక కొరత కారణంగా అభివృద్ధి పనుల్లో ఆటంకం ఏర్పడుతోందని.. రాయల్టీ తగ్గించి తవ్వకాల సమయం పెంచాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో చేపడుతున్న రైల్వే వంతెన పనుల్లో వేగం పెంచాలని.. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు.

# అభివృద్ధికి కృషి చేయాలి!

**- జిల్లా కలెక్టర్ కు కు సనాతన సమితి సభ్యుల అభినందనలు**





**ఈకాలం, ఆదిలాబాద్**
వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను ఇప్పటికే అభివృద్ధి దిశవైపు తీసుకెళు_న్నారని, మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలను చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సమితి సభ్యులు శుక్రవారం కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.హోలీ పండుగ సాంప్రదాయం ప్రకారం చక్కెర బిళ్ళల పేర్లు, గులాబీ పూలను, అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా హోలీ పండుగ సందర్భంగా కలెక్టర్ కు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అటు సమితి ఆధ్వర్యంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను మరిన్ని చేపడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని కలెక్టర్ సూచించినట్లు సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి కోశాధికారి రేణిగుంట రవీందర్ , సమాన పల్లి నర్సింలు , మీసాల స్వామి, మామిడి రాజు , కిషన్ , అశోక్ రెడ్డి , ఉరాడే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత కొత్త తేడా లేకుండా కమిటీల ఏర్పాటు

**- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి**
**- విలేకరుల సమావేశంలో ఎంఎల్ఏ మేఘారెడ్డి,డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డిలు**



భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ని చేసేంతవరకు విశ్రమించకూడదని, ప్రతి ఒక్కరం సంఘటితంగా పనిచేసి క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.ఈ నెల 9వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు బూత్ స్థాయి కమిటీ,వార్డ్ కమిటీ, గ్రామ కమిటీ,మండల కమిటీ, పట్టణ కమిటీల ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం బూతు అధ్యక్షుడిని కూడా నియమిస్తుందన్నారు.ఓటు హక్కు ఉన్న బూతులోనే అక్కడి నాయకుడు బూతు అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడని ఉదాహరణకు వనపర్తి ఎమ్మెల్యే కి మంగంపల్లిలో ఓటు హక్కు ఉందని ఓటు హక్కు ఉన్న బూత్ కి ఎమ్మెల్యే బూత్ అధ్యక్షుడిగా ఉంటారని వారు తెలిపారు.వీటితోపాటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విభాగాలను సైతం ఏర్పాటు చేస్తారని అలాగే సంఘాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.కాంగ్రెస్ మహిళా విభాగం కూడా ఎన్నుకోబడుతుందని ఎవరైతే ఉత్సాహంగా పని చేసేందుకు ముందుకు వచ్చిన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వారు తెలిపారు.క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ పూర్తి సంసిద్ధంగా ఉందని పార్టీ అభిమానులు కార్యకర్తలు నాయకులు ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని ఎవరు కూడా నిరాశ చెందకుండా పార్టీ కోసం పని చేయాలని వారు సూచించారు.

# ఇలలో వెలసిన శక్తి మహిళ

**- అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గోలి శిరీష**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎం.జె.పి. హుజురాబాద్ జె.ఎల్ తెలుగు విభాగానికి చెందిన గోలి శిరీష మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణానికి మహిళలు మూలస్తంభమని, కుటుంబానికి అండగా నిలిచే మహాశక్తి మహిళ అని ఆమె పేర్కొన్నారు.భూమాతలా అపారమైన సహనం మహిళలలో ఉంటుందని, సృష్టిలో మహిళ గొప్ప సృష్టికర్తగా నిలుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులకు ఆప్యాయత పంచే కూతురుగా, సోదరులకు అనురాగం అందించే సోదరిగా, భర్తకు తోడుగా నిలిచే భార్యగా మహిళ ఎన్నో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తుందని చెప్పారు.తల్లి రూపంలో పిల్లలను ప్రేమతో పెంచి కుటుంబాన్ని సుసంపన్నంగా నడిపించే అంగనగా మహిళ సమాజంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కరుణ, జాలి, ప్రేమ, సహనం వంటి విలువలకు మహిళలు ప్రతిరూపమని తెలిపారు.గతంలో అబలగా భావించిన మహిళలు నేడు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, వ్యాపారం వంటి రంగాల్లో సబలంగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి పునాది అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ గోలి శిరీష అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొత్తకాపు ఈశ్వరమ్మ మండపాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి



జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధికి చెందిన కొత్తకాపు కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు, నూతనంగా నిర్మించిన కొత్తకాపు ఈశ్వరమ్మ మండపాన్ని శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి ప్రారంభించారు.జహీరాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి గారితో కలిసి ఆయన ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తకాపు కుటుంబ సభ్యులు ఉజ్వల్ రెడ్డి గారిని మరియు ఇతర అతిథులను ఘనంగా సన్మానించారు. పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో డా. ఉజ్వల్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు:ముబీన్: సిడిసి. చైర్మన్ నర్సింహారెడ్డి: జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి: యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు రాములు: మాజీ వైస్ ఎం.పి.పిపట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి: సీనియర్ నాయకులు మల్లారెడ్డి : సిడిసి డైరెక్టర్ అరుణ్ కుమార్: కౌన్సిలర్ హర్షవర్ధన్ రెడ్డి, అశ్విన్ పాటిల్, కిరణ్ కుమార్ గౌడ్, రవి, పవన్: యూత్ కాంగ్రెస్ మరియు సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో కొత్తకాపు కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బర్దీపూర్ ఆశ్రమంలో ఆధ్యాత్మిక శోభ దత్తగిరి మహారాజ్ ఆరాధన మహోత్సవాలు

ఝురాసంగం మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బర్దీపూర్ ఆశ్రమం గురువారం ఆధ్యాత్మిక చైతన్యంతో విరాజిల్లింది. దత్తగిరి మహారాజ్ వార్షిక ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని ఆశ్రమ ప్రాంగణంలో భక్తి కార్యక్రమాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జగద్గురు ఆది శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ?వైభవంగా జపయజ్ఞం మరియు హోమాలు దత్తగిరి మహారాజ్ ఆరాధన పర్వదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు:

మహా మృత్యుంజయ మంత్ర శత సహస్ర జపయజ్ఞం: భక్తుల ఆయురారోగ్యాల కోసం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. విశేష హోమ కార్యక్రమాలను నిర్వహించి స్వామివారికి పూర్ణాహుతి సమర్పించారు. ఆధ్యాత్మిక ప్రసంగం ?కార్యక్రమానికి విచ్చేసిన సిద్ధం ఉజ్వల్ రెడ్డి కి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు ఉజ్వల్ రెడ్డి ని శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు.



**ఈ సందర్భంగా సిద్ధం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ:**

"దత్తగిరి మహారాజ్ వంటి మహనీయులు నడయాడిన ఈ పుణ్యభూమిలో ఆది శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మహారాజ్ ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ జపయజ్ఞం అందరికీ సుఖశాంతులను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."

మరియు భక్తులు ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఉజ్వల్ రెడ్డి తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు: ముబీన్,సిడిసి (జణజ) చైర్మన్ నర్సింహారెడ్డి, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు అశ్విన్ పాటిల్, జగదీశ్వర్ రెడ్డి, మల్లికార్జున్: ప్రముఖ నాయకులు ?ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు ఆధ్యాత్మిక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తగిరి మహారాజ్ కృపకు పాత్రులయ్యారు.

# వేం నరేందర్ రెడ్డిని అభినందిచి శుభాకాంక్షలు చెప్పిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**– హన్మకొండ డీసీసీ అధ్యక్షులు,వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో రాజ్యసభ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.తెలంగాణ నుంచి ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ తరపున వేం నరేందర్ రెడ్డి మరియు అభిషేక్ మను సింఘ్వీ మాత్రమే సరైన పత్రాలతో నామినేషన్ వేసినందున, వీరిద్దరి ఎన్నిక దాదాపు ఏకగ్రీవం (ఉన్ననిమస్) కానుంది.సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు,వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి వేం నరేందర్ రెడ్డిని వారి నివాసంలో కలిసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పెనుబల్లి మండలం లోని కనకగిరి గుట్టలు పులి గుండాల మధ్య అడవిలో సంచరిస్తున్న చిరుత పులి కలకలం

రిజర్వ్ ఫారెస్ట్ లో అటవీశాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ట్రాప్ లో లభ్యమైన చిరుత కూన పిల్లతో ఉన్న చిరుత పులి జింక ఎలుగుబంటి దృశ్యాలు



కనకగిరి గుట్టల పరిధిలో ఉన్న స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన ఫారెస్ట్ సిబ్బంది

# దమ్మపేట లో ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రారంభం

**– పారిశుధ్య సిబ్బందితో కలిసి చీపిరి పట్టిన పాలకవర్గ సభ్యులు**

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా మార్చి 6 నుండి మార్చి 15 వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు మరియు యువకుల భాగస్వామ్యం తో మొదటి దశగా పారిశుధ్యం మరియు ఫైల్ క్లియరెన్స్ 10 రోజుల ప్రత్యేక డ్రైవ్ లో శుక్రవారం దమ్మపేట పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో కలిసి పాలక వర్గ సభ్యులు, కార్యదర్శి దమ్మపేట ప్రధాన సెంటర్ బాలాజీనగర్ రోడ్డుకు ఇరువైపుల చెత్తను తొలగించి శుభ్రం చేసే డ్రైవ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దమ్మపేట పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుండి 10 రోజుల పాటు రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తాము అని, ముఖ్యంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సన్నాహక సమావేశం, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ప్రజా సంస్థల శుభ్రత, చెత్త వేరు చేసి సేకరణపై అవగాహన కార్యక్రమం, వీధులు మరియు డ్రెయిన్ల శుభ్రపరచడం, మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం మరియు నిరుపయోగ బావులు/బోర్లు మూసివేత, గ్రామపంచాయతీ స్థాయి సమావేశం, శుక్రవారం - డ్రై డే, నర్సరీ మరియు వీధి కుక్కల నియంత్రణ, సన్మానం మరియు ఆరోగ్య శిబిరం, ఓరియెంటేషన్ శిక్షణ, ప్రణాళిక మరియు అమలు మొదలగున్నవి నిర్వహిస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, బత్తుల సాయి,



చాట్ల శ్రీను, ధర్మసోతు పద్మ, బద్దె వెంకటలీల, చిన్నశెట్టి నాగలక్ష్మి, పూనెం పోలమ్మ, దాసరోజు రామారావు, విజయ్, సింగ్, గణేష్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పాలన'కు యాక్షన్ ప్లాన్ సిద్ధం: కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి జిల్లాలో 99 రోజుల 'ప్రగతి పాలన' ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మెదక్లో మంత్రి వివేక్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

# శ్రీ చైతన్య స్కూల్ నర్సంపేట బ్రాంచ్ కు జాతీయ స్థాయి ప్రతిభా పరీక్షల్లో ఘన విజయం

నర్సంపేటలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష అయిన ఐఎన్టిఎస్ఓ ఫైనల్ లెవల్ ఫలితాలు 2025--26లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించారు. ఈ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్, గోల్డ్ మెడల్స్ మరియు మెరిట్ సర్టిఫికేట్లు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా 4వ తరగతి విద్యార్థి రాకం కృతిక్ గ్రాండ్ ప్రైజ్ లెనోవో లాప్టాప్ తో పాటు గోల్డ్ మెడల్ సాధించాడు. 6వ తరగతి విద్యార్థిని చిర్లాంచ హన్విక మొదటి బహుమతి లెనోవో ట్యాబు , 3వ తరగతి విద్యార్థిని స్మైలీ జెట్టి మరియు 7వ తరగతి విద్యార్థి బూస సురేష్ రెండవ బహుమతి సాధించారు.అలాగే 8వ తరగతి విద్యార్థులు దొంతి సమిక్ష, కోడి పవన్ కుమార్ మూడవ బహుమతి గెలుచుకున్నారు.ఇక 10వ తరగతి విద్యార్థిని మణి చందన కక్కర్ల , 9వ తరగతి విద్యార్థి చిగురు శ్రీరామ్ నాల్గవ బహుమతి సాధించగా, 4వ తరగతి విద్యార్థి అభిరామ్ భూక్య, 5వ తరగతి విద్యార్థి గుటోజు దేవాంశ్, 9వ తరగతి విద్యార్థిని పాతి సిరి ఐదవ బహుమతి



సాధించారు.ఈ పోటీలలో పాఠశాల విద్యార్థులు మొత్తం 237 బహుమతులు సాధించగా, అందులో 143 గోల్డ్ మెడల్స్, 71 కన్సొలేషన్ ప్రైజులు 12 స్పెషల్ ప్రైజులు ఉన్నాయి. ఈ రోజు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు లెనోవో లాప్టాప్ మరియు లెనోవో ట్యాబు భాహుకరించటం జరిగినది. విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ అమర్ నాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్ శ్రీవిద్య డిజిఎం చేతన్ ఏజిఎం పద్మాకర్ కో ఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి, డీన్ చిరంజీవి, సి బ్యాచ్ ఇంచార్జ్ చంద్రకాంత్ ప్రైమరీ ఇంచార్జ్ స్రవంతి ఐఎన్టిఎస్ఓఇంచార్జ్ షరీఫ్ విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా 'వేసవి నీటి ఎద్దడిపై ప్రతిపాదనలు ఇవ్వండి'

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ ఆదేశించారు. మెదక్లో జరిగిన సమీక్షా



సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగూరు ప్రాజెక్ట్ మరమ్మతుల వల్ల ఎక్కడా నీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. నివేదికలు అందిన వెంటనే అదనపు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# గౌరవ ప్రధాన మంత్రి గారు.. ప్రజలు గమనిస్తున్నారు!

**– హోతి (బి) గ్రామంలో మహిళా కాంగ్రెస్ నిరసన: కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామాకు డిమాండ్**

జహీరాబాద్ హోతి (బి) గ్రామంలో మహిళా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో "ది పి.యం. ఈజ్ కాంప్రమైజ్డ్" అనే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ నాయకురాలు అస్మా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ఈ సందర్భంగా శ్రీమతి అస్మా మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు:**

"ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్స్టిన్ ఫైల్స్లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు కనిపించడం దిగ్భ్రాంతికరం. సీరియల్ రేపిస్ట్, పెడోఫైల్ అయిన ఎప్స్టిన్తో సంబంధం ఉందని స్వయంగా ఆయనే అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి.""ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం వారిని రక్షించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు."ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైతే, ప్రధానమంత్రి రాజీ పడ్డారా అని ప్రజలు భావించాల్సి వస్తుంది. మహిళల గౌరవం అనేది కేవలం నినాదాలకే పరిమితం కాకూడదు."





**డిమాండ్లు:**

- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి.
- ఈ వ్యవహారంపై తక్షణమే ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించాలి.
- ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొని, నిరసన తెలుపుతూ సంతకాల సేకరణ చేపట్టారు. న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు - తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.
- ఈ కార్యక్రమంలో మాజీ జెడ్.పి.టి.సి మాణిక్యమ్మ , నాయకురాళ్లు అనిత, బుజ్జమ్మ, సుజాత, చంద్రకళ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నా...

**– మంత్రి దామోదర్ రాజనర్సింహా .**





మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, లక్ష్మణ్ కుమార్, ఎంపీ కడియం కావ్య, శాసనసభ్యులు మాజీ మంత్రి కడియం శ్రీహరి, వేముల వీరేశం, తోట లక్ష్మీనారాయణ, కాలే యాదయ్య, కాంతారావు, ప్రొఫెసర్ కాసిం, మేడి రమేష్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం , తాహసిల్దార్ రాధా లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రాష్ట్ర శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం సుదీర్ఘంగా సాగిందన్నారు. రాజకీయంగా ఎంతో ఒత్తిడి ఉన్న రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి గారికి దక్కిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు.

# కాలుష్యంపై నిర్లక్ష్యం వద్దు: ఎంపీ రఘునందన్

సంగారెడ్డి నుంచి బీహెచ్ఎల్ వరకు పెరిగిపోతున్న కాలుష్యంపై ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కంకర మిషన్ల వద్ద దుమ్ము వెదజల్లుతున్నా పొల్యూషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

